సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



కనిపించని తునికి, పాలపండ్లు

అడవుల నరికివేతతో తునికి, పాలచెట్లు అంతరించిపోతున్నాయి. దీంతో పోషక విలువలు కలిగిన ఆ పండ్లు దొరకడం లేదు. 8లో



ఎంఎల్ 'ఆఫీసుల' పోరు..

ఇల్లెందులో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, న్యూడెమోక్రసీ వర్గాల నడుమ కార్యాలయం కోసం పోరు మొదలైంది. 8లో

గరిష్టం / కనిష్టం
39° / 22°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. గంటగంటకూ ఎండలు పెరుగుతాయి. రాత్రి కూడా వేడిగానే ఉంటుంది.



న్యూస్‌రీల్

రామయ్యకు ఘనంగా సువర్ణ తులసీ అర్చన



స్వామివారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపించారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న జడ్జి



పంచవటీ కుటీరంలో జడ్జి, కుటుంబసభ్యులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అమరావతి జడ్జి సునీత కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.


జేఈఈ పరీక్ష కేంద్రం తనిఖీ

సుజాతనగర్: జేఈఈ మెయిన్స్ పరీక్ష రెండో రోజైన శనివారం అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం పరీక్షకు 70 మందికి గాను 65 మంది, సాయంత్రం పరీక్షకు 68 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని కొత్తగూడెం ఆర్డీఓ స్వర్ణలత తనిఖీ చేసి వసతులను పరిశీలించారు.

12 నుంచి బీఫార్మసీ ఐదో సెమిస్టర్ పరీక్షలు


కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ (సీబీసీఎస్) ఐదో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈ నెల 12న పేపర్-1 మెడిసినల్ కెమిస్ట్రీ, 15న పేపర్-2 ఇండస్ట్రియల్ ఫార్మసీ, 18న పేపర్-3 ఫార్మసీకాలజీ, 20న పేపర్-4 ఫార్మాకాగ్నసీ అండ్ ఫైథోకెమిస్ట్రీ, 24న పేపర్-5 ఫార్మస్యూటికల్ జ్యూరిస్‌ప్రుడెన్స్ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. నిర్ణీత తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని వివరించారు.

పెరుగుతున్న కరోనా కేసులు



పాల్వంచ: పాల్వంచ పట్టణంలో కరోనా పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ కు జ్వరం వస్తుండడంతో కరోనా పరీక్ష చేయగ పాజిటివ్ వచ్చింది. స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జ్వరంతో బాధ పడుతున్న వ్యక్తికి పరీక్ష చేయగా కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. నిత్యం ఆస్పత్రులకు వచ్చే వారిలోనూ పలువురికి కరోనా లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్య సిబ్బంది భయాందోళన చెందుతున్నా రు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్క్ లు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

వేడెక్కిన 'గూడెం'



కొత్తగూడెం కేంద్రంగా రాజకీయ వ్యూహాలు

- కీలక మలుపునకు ఈ నియోజకవర్గమే వేదిక
- ముమ్మరమైన ఆశావహుల ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఏకైక జనరల్ సీటుగా ఉన్న కొత్తగూడెం నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కాయి. కొత్తగూడెం కేంద్రంగా జిల్లా రాజకీయాలపై తమ ముద్రను కొనసాగించేందుకు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. దీంతోపాటు జిల్లా ప్రజలంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న కొత్త రాజకీయ సమీకరణలకు ఇక్కడే బీజం పడే అవకాశం ఉంది. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆశావహులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆ మేరకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా ఆశావహులు, ప్రజాబలం ఉన్న నాయకులు, పార్టీలు 'గూడెం' వేదికగా వ్యూహాలకు పదును పెడుతున్నాయి.

సింగరేణిలో బీఆర్ఎస్ సైరన్..

గత అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి బెల్ట్‌లో అధికార బీఆర్ఎస్ పార్టీకి చేదు ఫలితాలే ఎదురయ్యాయి. జిల్లాలో సింగరేణి గనులు విస్తరించి ఉన్న ఇల్లెందు, కొత్తగూడెం, పినపాక నియోజకవర్గాల్లో కారు జోరు చూపించలేకపోయింది. అయితే ప్రస్తుత పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ మూడు స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ బలంగా కనిపిస్తోంది. ఇదే బలాన్ని ఎన్నికల వరకు కొనసాగించే లక్ష్యంతో సింగరేణి సమస్యలపై పోరాటానికి ఆ పార్టీ సిద్ధమైంది. సింగరేణి ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకునే లక్ష్యంతో కొత్తగూడెంలో బీఆర్ఎస్, దాని అనుబంధ కార్మిక సంఘమైన టీజీబీకేఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన మినహాయిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మెజార్టీ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ ధర్నాలో కలిసికట్టుగా పాల్గొన్నారు. దీంతో సింగరేణి పరిరక్షణ కోసం పోరాటానికి సిద్ధమంటూ గులాబీ పార్టీ తరఫున సైరన్ మోగించినట్టయింది.

బహిరంగ సమ్మేళనం..

భారత రాష్ట్ర సమితిపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరుసగా తన మద్దతుదారులతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. మొదటి సమావేశం మణుగూరులో జరగగా నాలుగో సమావేశం భద్రాచలంలో నిర్వహించారు. మొదటి సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ విధానాలు, ఆ పార్టీ నేతలపై పరోక్ష విమర్శలకు పరిమితమైన పొంగులేటి.. భద్రాచలం వచ్చే సరికి స్వరం పెంచారు. నేరుగా సీఎం కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు ఎక్కుపెట్టారు. కాగా, నేడు కొత్తగూడెంలో జరగబోయే సమావేశంలో మరింత సూటిగా, స్పష్టంగా తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది. పైగా తాను చేరబోయే పార్టీని బట్టి పోటీ చేసే అసెంబ్లీ స్థానం ఉంటుందంటూ మధిరలో పొంగులేటి చేసిన ప్రకటన మరింత ఆసక్తి రేకెత్తించింది. దీంతో అందరి దృష్టి కొత్తగూడెం ఆత్మీయ సమావేశం వైపునకు మళ్లింది. మరోవైపు ఇప్పటి వరకు జరిగిన సమావేశాలు ఉదయం మొదలై మధ్యాహ్న భోజన సమయంలో ముగిసేవి. కానీ కొత్తగూడెం సభ అందుకు భిన్నంగా సాయంత్రం మొదలవుతోంది. దీని కోసం ప్రకాశం స్టేడియంలో భారీ ఎత్తున ఏర్పాట్లు జరిగాయి. పేరుకే ఆత్మీయ సభగా పిలుస్తున్నా ఇది పొంగులేటి, ఆయన మద్దతుదారులు నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభగానే రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ట్రస్ట్‌తో 'గడల' ముందుకు..

డీహెచ్ గడల శ్రీనివాస్ రాజకీయాల్లోకి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే అనేక వేదికలపై బహిరంగంగా తన మనసులో మాట చెప్పారు. కొత్తగూడెం కేంద్రంగా రాజకీయ భవిష్యత్ నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా తన తండ్రి గడల సూర్యనారాయణ ట్రస్ట్ (జీఎస్ఆర్) పేరుతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే హెల్త్‌క్యాంపులు, జాబ్‌మేళా, మహిళా శక్తి కార్యక్రమాలు నిర్వహించిన ఆయన.. ఏప్రిల్ 8, 9 తేదీల్లో యువశక్తి పేరుతో ముందుకొచ్చారు. క్రమం తప్పకుండా వీకెండ్ రోజుల్లో కార్యక్రమాలు చేపడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో బిజీ అవుతున్నారు.

సింగరేణిని కాపాడుకుందాం




మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, చిత్రంలో ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యేలు రేగా, వనమా, హరిప్రియ

- కేంద్ర ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టండి
- మహాధర్నాలో మంత్రి పువ్వాడ పిలుపు
- హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ సిరుల గని అయిన సింగరేణికి చెందిన నాలుగు బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, సింగరేణి కార్మికులు, కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించి సంస్థను కాపాడుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ, ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటనకు నిరసనగా శనివారం కొత్తగూడెంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. సింగరేణి ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఆపాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినా ప్రధాని మోదీ కుట్రపూరితంగా వ్యవహరిస్తూ గనుల వేలం ప్రక్రియను మరోసారి తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఇప్పటికే పలుమార్లు వేలానికి ప్రయత్నం చేసినా ప్రైవేట్ కంపెనీల నుంచి స్పందన రాలేదన్నారు. ఇప్పటికైనా కేంద్రం దిగివచ్చి సింగరేణి గనుల ప్రైవేటీకరణ యత్నాన్ని మానకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ మోదీ ఇప్పటివరకు దోచుకున్నది చాలక సింగరేణిపై కన్నేశారని, నౌకాదళం, ఎయిర్‌పోర్టు, ఎల్ఐసీ, బ్యాంకింగ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడమే కాక సింగరేణిని కూడా అమ్మేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. రూ.50కోట్ల బడ్జెట్‌ను 12 నిమిషాల్లో తేల్చి, అందులోని అంశాల గురించి ప్రతిపక్ష నాయకులు మాట్లాడకుండా చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ తెలంగాణను దెబ్బ కొట్టేందుకే కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించేందుకు యత్నిస్తోందని అన్నారు. లాభాల్లో నడుస్తున్న అనేక ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తోందన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కూడా దివాలా తీయించిన కేంద్రం.. అదే విష ప్రయోగాన్ని సింగరేణిపై అమలు చేయాలని చూస్తోందన్నారు. పోరాటాల పురిటిగడ్డ అయిన తెలంగాణలో మోదీ ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్ మాట్లాడుతూ 133 సంవత్సరాల ఘన చరిత్ర గల సింగరేణి గనులను ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే కార్మిక సంఘాలన్నీ ఐక్యమై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కేంద్రం వైఖరితో తెలంగాణ చీకటిమయం అవుతుందని, కార్మికులు శ్రమదోపిడీకి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, ఇల్లెందు, అశ్వారావుపేట, వైరా, సత్తుపల్లి, పాలేరు ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, రాములు నాయక్, సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఖమ్మం కార్పొరేషన్ మేయర్ నీరజ, ఇల్లెందు, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్లు డి. వెంకటేశ్వర్లు, కాపు సీతాలక్ష్మి, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం , సుడా చైర్మన్ విజయ్‌కుమార్, విద్యాసంస్థల చైర్మన్ జేవీఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందుకు కేటీఆర్ ప్రశంసలు

- పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక వీడియో
- సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్



సోషల్ మీడియాలో మంత్రి కేటీఆర్ పెట్టిన పోస్ట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రశంసించారు. ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న మినీ ట్యాంక్‌బండ్, పట్టణ ప్రకృతి వనం, ప్రధాన రహదారి అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్, మెయిన్ రోడ్ బ్యూటిఫికేషన్ తదితర పనులతో కూడిన వీడియోను మంత్రి కేటీఆర్ నిర్వహిస్తున్న శాఖలకు సంబంధించిన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేశారు. ట్విటర్, ఫేస్‌బుక్ వేదికగా షేర్ చేసిన వీడియోలకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తోంది. కేవలం రెండు గంటల వ్యవధిలోనే 88 రీట్వీట్స్, 11 వేల వరకు వ్యూస్ వచ్చాయి. గత కొద్ది రోజులుగా ప్రగతి పథంలో తెలంగాణ మున్సిపాలిటీ పేరుతో మంత్రి కేటీఆర్ వివిధ మున్సిపాలిటీల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులు, పట్టణ రూపురేఖలు మారిన తీరును సోషల్ మీడియాలో షేర్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి ఇల్లెందు మున్సిపాలిటీలో చోటు చేసుకుంటున్న పనులను ప్రగతి పథంలో తెలంగాణ మున్సిపాలిటీలు పార్ట్ 3లో భాగంగా శనివారం మధ్యాహ్నం షేర్ చేశారు.

అందరి సహకారంతోనే 'నవ' అభివృద్ధి



హాజరైన సీఈఓ ఇతర అధికారులు

పాల్వంచ: నవ లిమిటెడ్ సంస్థ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాత్ర పోషించారని సీఈఓ అశ్విన్ దేవినేని అన్నారు. నవ లిమిటెడ్ సంస్థ 51వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి స్థానిక నవ కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. సంస్థ ప్రారంభం నుంచి నేటి వరకు అనేక రకాలుగా పురోభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఉత్పత్తిలో అనేక ఒడిదుడుకులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ఉద్యోగుల శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. సంస్థ చేపడుతున్న అనేక సామాజిక కార్యక్రమాల్లో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నామని, ఇది తమకెంతో గర్వంగా ఉందని అన్నారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నిఖిల్ దేవినేని మాట్లాడుతూ తమ సంస్థ సేవా కార్యక్రమాలు ఇతర ప్రాంతాలకూ ఆదర్శంగా మారాయన్నారు. ఇదే రీతిలో భవిష్యత్‌లోనూ ముందుకు సాగాలన్నారు. అనంతరం సంస్థలో 25 సంవత్సరాల పాటు పని చేసిన వారిని ఘనంగా సన్మానించారు. ప్రముఖ సినీ గాయని తేజస్వి సంగీత విభావరితో పాటు నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎల్.వి.శరత్ బాబు, డీజీఎం రాజేశ్వరరావు, నవభారత్ ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి ఏఓ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ టెన్షన్ లేకుండా..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ చేపట్టిన మహాధర్నాతో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చేయడంలో పోలీసులు సఫలీకృతులయ్యారు. గతంలో జరిగిన ధర్నాలు, రాస్తారోకోలను దృష్టిలో ఉంచుకుని ఈసారి బస్టాండ్ నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు ట్రాఫిక్ జామ్ కాకుండా బందోబస్తు నిర్వహించారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులను మరో మార్గంలోకి మళ్లించారు. రామవరం నుంచి బస్టాండ్ వైపు, చుంచుపల్లి నుంచి బస్టాండ్ వైపు వెళ్లే వాహనదారుల కోసం పోస్టాఫీస్ మీదుగా డీఎస్పీ కార్యాలయం పక్క నుంచి రూట్ ఏర్పాటు చేశారు. సూపర్‌బజార్ నుంచి రామవరం, చుంచుపల్లి మీదుగా వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసిన సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



పోస్టాఫీస్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన బారికేడ్లు

ఇంకెవరికైనా ఇచ్చారా?

- ఖమ్మం జిల్లాలో డీఏఓ ప్రశ్నాపత్రం లీకేజీ కలకలం
- ఇప్పటికే ఖమ్మంకు చెందిన దంపతుల అరెస్టు
- విచారణ ముమ్మరం చేసిన 'సిట్'



సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం రాష్ట్రంలోని పలుచోట్ల కలకలం సృష్టించగా ఆ ఆనవాళ్లు ఖమ్మంలోనూ బయటపడ్డాయి. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్(డీఏఓ) ప్రశ్నపత్రాన్ని జిల్లాకు చెందిన దంపతులు కొనుగోలు చేసినట్లు వెలుగులోకి రావడం సంచలనం కలిగించింది. జిల్లాకు చెందిన కార్ల వ్యాపారి సాయిలౌకిక్ తన భార్య సుస్మిత కోసం ప్రశ్నపత్రాన్ని రూ.10లక్షలకు కొనుగోలు చేసినట్లు సిట్ విచారణలో వెలుగు చూడడంతో వారిద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రశ్నపత్రాన్ని సుస్మిత కోసం కొనుగోలు చేసినా, ఆతర్వాత ఎవరికైనా ఇచ్చారా అనే అంశంపై సిట్ ప్రధానంగా దృష్టి సారించింది.

ముమ్మరంగా సిట్ విచారణ

పలు ఉద్యోగాలకు సంబంధించి ప్రశ్నపత్రాలు లీకేజీ అయినట్లు తేలగా.. సిట్ విచారణ చేపడుతోంది. ఇందులో భాగంగా డీఏఓ ప్రశ్నపత్రం బయటకు వచ్చినట్లు గుర్తించిన అధికారులు మరింత సమాచారం రాబట్టేందుకు యత్నిస్తున్నారు. పరీక్షపత్రం కొనుగోలు చేసిన సాయిలౌకిక్, సాయి సుస్మితను విచారించే క్రమంలో రూ.10 లక్షలకు వీరి కోసమే కొనుగోలు చేశారా, మరెవరికైనా ఇచ్చారా అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. అంత సొమ్ము వెచ్చించి ఒకరి కోసమే కొనుగోలు చేసి ఉండరనే భావనకు వచ్చిన సిట్ అధికారులు వెనుక ఎవరెవరు ఉన్నారనే అశంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

అభ్యర్థుల్లో ఆవేదన

డీఏఓ ప్రశ్నపత్రం లీక్ కావడంతో ఇప్పటికే పరీక్షను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసిన విషయం విదితమే. అయితే ఈ వ్యవహారంలో జిల్లాకు చెందిన ఇద్దరు ఉండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చ జరుగుతోంది. మరోవైపు పరీక్ష రాసిన నిరుద్యోగుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. డీఏఓ (డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్) పరీక్ష ఫిబ్రవరి 26వ తేదీన 27 కేంద్రాల్లో రెండు సెషన్లలో నిర్వహించారు. మొత్తం 9,426 మంది అభ్యర్థులకు గాను ఉదయం సెషనల్‌లో 6,478 మంది, మధ్యాహ్నం పరీక్షకు 6,404 మంది హాజరయ్యారు. ఎంతో కష్టపడి శిక్షణ తీసుకుని పరీక్ష రాస్తే ఫలితం లేకుండా పోయిందని అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు.

క్లుప్తంగా

వన్‌టౌన్ సీఐగా రాయల వెంకటేశ్వర్లు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సీఐగా రాయల వెంకటేశ్వర్లును నియమిస్తూ ఎస్పీ డాక్టర్ వినీత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీఐ బదిలీ కావడంతో నెల రోజులుగా పోస్టు ఖాళీగా ఉంది. టూటౌన్ సీఐ రాజుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. వెంకటేశ్వర్లు గతంలో జూలూరుపాడులో పని చేశారు. ఆ తర్వాత వరంగల్‌లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వీఆర్‌లో ఉన్నారు. వన్‌టౌన్ సీఐగా నియమించగా శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఆదివాసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో శనివారం రాత్రి ఆదివాసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆదివాసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టేడియంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఇల్లెందురూరల్: ఇల్లెందు నుంచి అక్రమంగా ఖమ్మం తరలిస్తున్న 110 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన బిల్లకంటి రాజు అనే వ్యక్తి లారీలో బియ్యం తరలిస్తుండగా సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ లలితాపురం గ్రామంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. లారీని స్థానిక పోలీసులకు అప్పగించగా, నిందితుడు రాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు.

మంచినీళ్లు అనుకుని..

పురుగులమందు తాగి వ్యక్తి మృతి

ములకలపల్లి : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సీతాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ఒగ్గెల పోతురాజు (45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఉదయం కూడా మద్యం తాగి తన మామిడితోటలో కాపలాకు వెళ్లాడు. ఆయన భార్య చిట్టెమ్మ మధ్యాహ్న సమయంలో భోజనం తీసుకుని తోటకు వెళ్లగా, పోతురాజు పడిపోయి ఉన్నాడు. ఆమె ప్రశ్నించగా సమీపంలో ఉన్న బాటిల్‌లోని మంచినీళ్లు తాగినట్లు తెలిపాడు. ఆ సీసాలో పురుగులమందు ఉన్నట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ లక్ష్మణ్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : కూలీలకు గాయాలు



ట్రాక్టర్ బోల్తా పడటంతో గాయపడ్డ కూలీలు

గుండాల: కూలి పనుల కోసం వెళ్లి వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లి మండలంలోని ఇప్పనపల్లి గ్రామానికి చెందిన పది మంది కూలీలు ట్రాక్టర్‌లో ఆళ్లపల్లిలో ఓ రైతుకు చెందిన మొక్కజొన్న చేను పనికి వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పనపల్లి గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ క్రమంలో పాయం మానస, గొగ్గెల సమ్మక్క, గొగ్గెల పార్వతి, జోగ లక్ష్మి, ఈసం నాగమణి, గొడ్డెల బోడయ్య, పూనెం భూ లక్ష్మి, పూనెం బాబులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా ఆళ్లపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకెళ్లారు.

పూరిల్లు దగ్ధం

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీ అణుశక్తినగర్ గ్రామానికి చెందిన బింగి వెంకటేశ్వర్లు పూరిల్లు శుక్రవారం రాత్రి దగ్ధమైంది. అర్ధరాత్రి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి పూరిల్లు కాలిపోయింది. గిన్నెలు, బట్టలు, సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. దీంతో కుటుంబం కట్టుబట్టలతో మిగిలిపోయింది. రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించి వివరాలు సేకరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్ వెంకటేశ్వర్లు కుటుంబానికి రూ.1000 నగదు, 10 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు.

లాడ్జిలో ఘర్షణ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ కాలనీలో ఉన్న లాడ్జిలో ఇద్దరు బాలికలు, ఓ బాలుడు కలిసి ఉన్న విషయంలో శనివారం ఘర్షణ జరిగింది. ఓ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులతోపాటు మరో విద్యార్థి స్థానికంగా ఉన్న ఒక లాడ్జికి వచ్చి గదిని అద్దెకు తీసుకున్నారు. వీరిలో ఓ విద్యార్థిని బయట ఉండగా, మరో విద్యార్థిని, విద్యార్థి గదిలో ఉన్నారు. విషయం తెలిసిన బాలికల బంధువులు లాడ్జి వద్దకు చేరుకుని బాలుడుతోపాటు బాలికలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లకు ప్రైవేటు లాడ్జి నిర్వాహకులు గదిని అద్దెకు ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు అక్కడకు చేరుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

కనిపించని తునికి, పాలపండ్లు

- అడవుల నరికివేతతో చెట్లు కనుమరుగు
- పోషకాలు అధికంగా ఉంటాయంటున్న వైద్య నిపుణులు





తునికి పండ్లు సేకరిస్తున్న గిరిజనులు (ఇన్‌సెట్) సేకరించిన పాలపండ్లు

కరకగూడెం: అడవుల నరికివేతతో తునికి, పాల చెట్లు అంతరించిపోతున్నాయి. దీంతో పోషక విలువలు కలిగిన తునికి, పాలపండ్లు దొరకడం లేదు. అటవీశాఖ అధికారులు కూడా ఈ వృక్షాలపై దృష్టి సారించడంలేదు. అక్కడక్కడా ఒకటో, రెండో చెట్లు ఉండగా గిరిజనులు పండ్లను సేకరించి విక్రయిస్తున్నారు. వేసవి కాలం ఏప్రిల్, మే నెలల్లో లభించే ఈ పండ్ల కోసం పలువురు ఎదురుచూస్తుంటారు. కాగా వీటిని పక్షులు, కోతులు, ఎలుగుబంట్లు ఎక్కువగా తింటాయని గిరిజనులు చెబుతున్నారు. తునికి(టెండూ ఫ్రూట్) పండ్లు తింటే అజీర్తి, నోటి పూత సమస్యలు తగ్గుతుతాయని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, అధిక రక్తపోటును, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా తీసుకోవచ్చని, వీటిని డ్రై ఫ్రూట్స్‌గా కూడా తీసుకోవచ్చని చెబుతున్నారు. ఇక పాల పండ్లు శరీరంలో వేడిని తగ్గిస్తాయని, వీటిలో ఏ, బీ, సీ, ఈ విటమిన్లు, కాల్షియం, కార్బొహైడ్రేట్స్, ఐరన్, పీచు పదార్థాల వంటి పోషకాలు అధికంగా ఉంటాయని పేర్కొంటున్నారు.

సేకరించి అమ్ముతుంటాం



తునికి, పాల పండ్లను అడవుల నుంచి సేకరించి మార్కెట్లో అమ్ముతుంటాం. కొందరు ఇష్టంగా కొనుగోలు చేసి తింటారు. గతంలో లాగా పండ్లు దొరకడం లేవు.

–మడకం జ్యోతి, అశ్వాపురపాడు గ్రామస్తురాలు

గతంలో మాదిరి దొరకడం లేవు



నా చిన్నతనంలో తునికి, పాల పండ్లు విరివిగా దొరికేవి. అడవుల నరికివేతతో చెట్లు బాగా తగ్గిపోయాయి. గతంలో మాదిరి దొరకట్లే. దొరికితే ఈ పండ్లను ఇష్టంగా తింటుంటాను.

– చందా నారాయణ, కరకగూడెం గ్రామస్తుడు

ఆర్టీసీలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు

చుంచుపల్లి: కొత్తగూడెం బస్టాండ్‌లో జీఎస్సార్ ట్రస్ట్ సహకారంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రతి వేసవిలో ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికులు, సిబ్బంది తాగునీటి సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జీఎస్‌ఆర్ ట్రస్ట్ స్పందించి రూ.2.30 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకువచ్చింది. ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆర్వో ప్లాంట్‌తో పాటు వాటర్ కూలింగ్ యంత్రాన్ని సైతం అందించి, శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన కొత్తగూడెం ప్రాంతానికి సేవ చేయడం కోసమే జీఎస్‌ఆర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. బస్టాండ్‌లో తాగునీటి సమస్యను అధికారులు తన దృష్టికి తేవడంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

జీఎస్సార్ ట్రస్ట్ ఛైర్మన్ గడల శ్రీనివాసరావు

కొత్తగూడెంరూరల్: యువత అన్ని రంగాల్లో రాణించాలని జీఎస్సార్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడాల శ్రీనివాసరావు సూచించారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన యువశక్తి, యంగ్‌లీడర్స్ వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. యువత తమలో ఉన్న అపార శక్తిసామర్థ్యాలను గుర్తించాలని, అప్పుడే మార్పు వస్తుందని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గంప నాగేశ్వరరావు బృందంతో రెండు రోజులపాటు యువతకు వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి 1,632 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు.

పిడుగుపాటుతో దుక్కిటెద్దులు మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన దుక్కిటెద్దులు

గుండాల: నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షంతోపాటు పిడుగుపాటుకు మూడు దుక్కిటెద్దులు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని దామరతోగు గ్రామానికి చెందిన సుతారి రామయ్యకు చెందిన మూడు దుక్కిటెద్లు మేతకు వెళ్లి నాలుగురోజులుగా కనిపించడంలేదు. దీంతో అడవి గాలించగా స్థానిక గుట్ట సమీపంలో మృతి చెంది ఉన్నాయి. పరిసరాలను గమనించి పిడుగుపాటుతో మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. ఎద్దుల మృతితో సుమారు రూ.80 వేలు నష్టపోయానని, వ్యవసాయం ఎలా చేయాలని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నాడు.

ఎంఎల్ 'ఆఫీసుల' పోరు..

ఎన్డీ, ప్రజాపంథా నేతల నడుమ ఘర్షణ



ఇల్లెందులోని చంద్ర కృష్ణమూర్తి అలియాస్ ఎల్లన్న విజ్ఞాన కేంద్రం

ఇల్లెందు: ఇల్లెందులో ఎంఎల్ వర్గాల నడుమ చంద్ర కృష్ణమూర్తి అలియాస్ ఎల్లన్న స్మారక విజ్ఞాన కేంద్రం(ఆఫీస్) కోసం పోట్లాట మొదలైంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు దఫదఫాలుగా ఎన్డీ నాయకులు, ప్రజాపంథా నేతల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో పోలీసులు చేరుకుని భవనానికి పహారా కాయడంతో పాటు ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించారు. ఇల్లెందు పటేల్ చౌక్‌లో ఇప్పటికే ఓ కార్యాలయం ఉండగా, కళాసీబస్తీలో చంద్ర కృష్ణమూర్తి అలియాస్ ఎల్లన్న స్మారక విజ్ఞాన కేంద్రం పేరుతో రెండంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. ఈభవనం అసంపూర్తిగానే ఉండగా, అర్ధరాత్రి పాత గేటు తొలగించేందుకు యత్నించగా ఘర్షణ మొదలైంది. మళ్లీ ఉదయం ఆఫీస్‌పై ఎన్డీ నేత మధు జెండా ఎగురవేసేందుకు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ భవనాన్ని కొంత భాగం మరమ్మతులు చేసి మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కార్యాలయంతో పాటు సభలు, సమావేశాలు జరుపుకునేందుకు యత్నిస్తున్నట్లు ప్రజాపంథా నేతలు చెబుతున్నారు. కానీ తాము పై అంతస్తు వాడుకునే యత్నాల్లో ఉన్నామని ఎన్డీ నేతలు వెల్లడించారు. పటేల్ చౌక్‌లోని కార్యాలయంలోకి తమను రానివ్వకుండా, ఎల్లన్న విజ్ఞాన కేంద్రం వద్దకు వచ్చి ఘర్షణ సృష్టించటం సరికాదని ప్రజాపంథా నాయకులు తెలిపారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను స్టేషన్‌కు పిలిపించగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆఫీస్ వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రజాపంథా నేతలు రాయల చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, యాకుబ్‌షావలీతో పాటు ఎన్డీ నేతలు మధు, బండారి ఐలయ్య తమ వాదన వినిపించారు.

పదో తరగతి విద్యార్థినికి అస్వస్థత



అస్వస్థతకు గురైన విద్యార్థిని మౌనిక

చండ్రుగొండ : చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఓ బాలిక శనివారం కళ్లు తిరిగి కిందపడిపోయింది. అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన బెజవాడ మౌనిక చండ్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శనివారం పరీక్ష రాస్తున్న విద్యార్థిని కళ్లు తిరిగి పడిపోయింది. అప్రమత్తమైన ఉపాధ్యాయులు బాలికను ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ కనకం తనుజా విద్యార్థినిని పరీక్షించి వైద్య సేవలందించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ వర్సా రవికుమార్ బాలికను మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో ఖమ్మం తరలించారు. నీరసంతో అనారోగ్యానికి గురైన బాలిక ఆరోగ్య పరిస్థితి కుదుట పడినట్లు వైద్యులు చెప్పడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

అరుదైన శస్త్ర చికిత్స

కణులతో కూడిన గర్భసంచి తొలగింపు

మణుగూరుటౌన్: మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు శనివారం ఓ మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. కణులతో కూడిన గర్భసంచిని తొలగించారు. మున్సిపాలిటీ పరిధిలోని కుంకుడు చెట్ల గుంపునకు చెందిన ఉల్లి రమాదేవి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రికి రాగా పరీక్షించిన వైద్యులు గర్భసంచికి కణుతులు ఉన్నాయని, ఆపరేషన్ చేసి తొలగించాలని తెలిపారు. శనివారం సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్, గైనకాలజిస్టు ఆనందరావు, మత్తు డాక్టర్ కృష్ణప్రసాద్ శస్త్ర చికిత్స నిర్వహించి ఆమె కడుపులో పెద్ద సైజు కణులతో ఉన్న గర్భసంచి తొలగించారు. సుమారు రూ.50 వేలు ఖర్చయ్యే శస్త్రచికిత్సను ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా నిర్వహించారంటూ బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు, ఆపరేషన్స్ చేస్తామని, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారు గొలుసు చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీ కేంద్రంలోని బింగి వీరస్వామి ఇంట్లో శనివారం చోరీ జరిగింది. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వీరస్వామి భార్య పిచ్చమ్మ మెడలోని మూడు తులాల బంగారు గొలుసు అపహరించారు. నిద్రలేచి గమనించిన బాధితురాలు ఆందోళనకు గురైంది. అనుమానితుల పేర్లతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వీరస్వామి తెలిపారు.

పత్తి వ్యాపారి పరార్

- రూ.60 లక్షలకు కుచ్చుటోపీ
- ఆందోళన చెందుతున్న రైతులు



ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

సుజాతనగర్: రైతుల వద్ద నుంచి సుమారు రూ.60 లక్షల విలువైన పత్తిని కొనుగోలు చేసిన ఓ వ్యాపారి డబ్బులు చెల్లించకుండా ఉడాయించిన సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. సుజాతనగర్ మండలం పాత అంజనాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని చిమ్నాతండా గ్రామానికి చెందిన పత్తి వ్యాపారి భూక్యా పుల్లారావు సుజాతనగర్ మండలంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన రైతుల వద్ద పత్తి కొనుగోలు చేశాడు. వ్యాపారి తీసుకున్న పత్తికి కొంత మొత్తంలో అప్పుడప్పుడు నగదు చెల్లిస్తూ రైతులను నమ్మించాడు. మార్కెట్ ధర కంటే అధిక రేటు ఇస్తామని ఆశ చూపి, ఒక్కో రైతు దగ్గర 5 నుంచి 15 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేశాడు. రైతులు డబ్బులు అడుగుతుండగా, రెండు మూడు నెలలుగా వాయిదాలు వేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం గ్రామాన్ని వదిలి ఎక్కడికో వెళ్లిపోయాడనే బాధిత రైతులు వాపోతున్నారు. సదరు వ్యాపారి ఇంటి వద్దకు వెళ్తే, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మోసపోయినట్లు గ్రహించారు. సుమారు రూ.60 లక్షలు రావాల్సి ఉందని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో యువకుడి హత్య

కొత్తగూడెంఅర్బన్: గంజాయి మత్తులో ఓ యువకుడిని రైల్వే స్టేషన్‌లో హత్య చేసిన సంఘటన శనివారం కొత్తగూడెంలో చోటుచేసుకుంది. గంజాయి విక్రయించేవారు, తాగేవారి మధ్య జరిగిన గొడవ హత్యకు దారితీసినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌లో రెండో నెంబర్ ప్లాట్ ఫారమ్‌పై పట్టణ పరిధిలోని కూలీలైన్ ఏరియాకు చెందిన రావి మన్మథరావు(35), గుర్తుతెలియని వ్యక్తులు గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి ఇనుప రాడ్డుతో దాడి చేయగా, తీవ్రగాయాలై మన్మథరావు ప్లాట్‌ఫారమ్‌పైనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోగా నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. త్రీటౌన్ పోలీసులు క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుల కోసం త్రీటౌన్ పోలీసులు, రైల్వే పోలీసులు గాలిస్తున్నారు.

అర్ధరాత్రి మట్టిదందా!

అక్రమంగా తరలిపోతున్న 'సీతారామ' మట్టి..

- అరికట్టడంలో ప్రాజెక్ట్ అధికారులు విఫలం
- పట్టుకున్న వాహనాలను రాజకీయ నాయకుల ఒతిళ్లతో వదిలేస్తున్నారనే ఆరోపణలు



శుక్రవారం రాత్రి లారీలో అక్రమంగా తరలిపోతున్న మట్టి



మొండికుంట శివారులో మట్టిదందా ప్రాంతం

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్ కాల్వ మట్టిని అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్నారు. అధికారుల ఉదాసీనతతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం అనుమతిలేకుండా మట్టి తరలిస్తుండగా ఆరు ట్రాక్టర్లు, జేసీబీని సీతారామ ప్రాజెక్ట్, పోలీస్ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి కూడా మూడు లారీలు, జేసీబీతో మట్టి సారపాక ఏరియాకు తరలించారు.

లారీకి రూ.3 వేలు, ట్రాక్టర్‌కు రూ.500

మండలంలోని మొండికుంట గ్రామ శివారు అటవీ ప్రాంతం నుంచి బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ వరకు సీతారామ ప్రాజెక్ట్ ప్యాకేజీ–2 కెనాల్ ప్రాంతం నుంచి కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, లారీలు, జేసీబీలతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మొండికుంట, మల్లెలమడుగు, తుమ్మలచెరువు ప్రాంతాలకు తరలిస్తూ ఒక్కో ట్రాక్టర్ రూ.400 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. లారీల ద్వారా సారపాక, మణుగూరు ప్రాంతాలకు తరలిస్తూ, ఒక్కో లారీ మట్టిని రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

కఠిన చర్యలేవి..?

కొంతకాలంగా కాల్వ మట్టి అక్రమంగా తరలిపోతున్నా నియంత్రించడంలో సీతారామ ప్రాజెక్ట్ అధికారులు విఫలమవుతున్నారు. పలుమార్లు వాహనాలను పట్టుకున్నా కఠిన చర్యలు తీసుకోకపోవడంతో మట్టి దందా ఆగడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రంగా జరిమానా విధించి, కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఈ నెల 5న ఆరు ట్రాక్టర్లు, జేసీబీని సీతారామ ప్రాజెక్ట్, పోలీస్ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడితో నామమాత్రంగా కేసు పెట్టినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంత జరిమానా విధించారనే విషయం కూడా అధికారులు వెల్లడించకపోవడం గమనార్హం.

రాత్రి విధులు కేటాయించినా..

సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ మట్టి అక్రమ దందాను అరికట్టేందుకు గత నెల 27న స్థానిక అధికారులు, సిబ్బందికి రాత్రి పూట కూడా విధులు కేటాయించినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. సీతారామ ప్రాజెక్ట్ ఏఈలు గణేష్‌నాయక్, బి.దుర్గాప్రసాద్, ఎం.రాజీవ్‌గాంధీ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కె.తిరుమలరావు, అప్పలనాయుడు, సింగారయ్యకు వారాల వారీగా రాత్రి 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు విధులు కేటాయించినట్లు పేర్కొంటున్నారు. అయినా మట్టి దందా ఆగకపోవడంతో సిబ్బంది, అధికారులు రాత్రి వేళ విధులు నిర్వర్తిస్తున్నారా? వారు విధుల్లో ఉండగానే మట్టి అక్రమంగా తరలిపోతోందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం

సీతారామ ప్రాజెక్ట్ కాల్వ మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం. ఇటీవల ఆరు ట్రాక్టర్లు, జేసీబీ పట్టుకుని కేసులు పెట్టాం. మట్టి తరలింపును అడ్డుకునేందుకు ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు రాత్రి పూట కూడా విధులు కేటాయించాం.

– వెంకటేశ్వరరావు, సీతారామ ప్రాజెక్ట్ ఈఈ

క్లుప్తంగా...

అమిత్ షాతో నల్లారి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీలో చేరిన మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో జరిగిన ఈ భేటీలో సంస్థాగత వ్యవహారాల పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పార్టీ పరిస్థితులతో పాటు కర్ణాటక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో ఏపీ నేతల ప్రచారంపైనా చర్చించినట్టు చెబుతున్నారు. ఇక కిరణ్ కుమార్‌రెడ్డి చేరిక కార్యక్రమానికి దూరంగా ఉన్న రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సైతం శనివారం సాయంత్రానికి ఢిల్లీ చేరుకున్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఇద్దరు నేతలు పలు అంశాలపై చర్చించుకున్న అనంతరం బీజేపీలోని మరికొంత మంది నేతలను కలిసినట్టుగా తెలిసింది.

'ఉపాధి' అనుసంధానానికి పోస్టుకార్డు ఉద్యమం

దుగ్గొండి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టుకార్డుల ఉద్యమం శనివారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మహ్మదాపురం గ్రామంలో ప్రారంభమైంది. మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రికి పోస్టు కార్డులు వేశారు. కేంద్రంపై పోరాటానికి మహ్మదాపురం వేదిక అయిందని, ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం సాగుతుందని ఎర్రబెల్లి తెలిపారు. గిరిజన యూనివర్సిటీ, కోచ్ ఫ్యాక్టరీ, ఇవ్వకుండా ఏ మొహం పెట్టుకొని ప్రధాని వచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

చిరుధాన్యాల ఎగుమతులు పెరగాలి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ నుంచి వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తుల ఎగుమతులను పెంచేందుకు అవకాశాలు ఉన్నాయని అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. 2023ను ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల ఎగుమతికి ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని ఎపెడా ప్రాంతీయ కార్యాలయంలో తెలంగాణలోని చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ప్రాసెస్డ్ ఫుడ్, పండ్లు తదితర రంగాలకు చెందిన ఎగుమతిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు.

రూ. కోట్లు కొల్లగొట్టిన ఐపీజీ రెంట్!

- రెట్టింపు సొమ్ము పేరుతో నల్లగొండ జిల్లాలో దోపిడీ
- మునుగోడు మండలం పలివెలలో మోసపోయిన ప్రజలు
- మొదట్లో తక్కువ మొత్తం పెట్టిన కొందరికి రెట్టింపుతో తిరిగి చెల్లింపు
- పెట్టుబడి పెట్టే వారి సంఖ్య వందలకు చేరడంతో కుచ్చుటోపీ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ/మునుగోడు: సైబర్ మోసగాళ్లు ఐపీజీ రెంట్ యాప్ పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. పెట్టిన పెట్టుబడికి వారం రోజుల్లోనే రెట్టింపు వడ్డీ వస్తుందని ఆశ చూపించడంతో డబ్బులు పెట్టిన వందల మంది మోసపోయారు. హైదరాబాద్‌తోపాటు నల్లగొండ జిల్లాలోని పలివెలలో ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టి డబ్బులు కోల్పోయిన బాధితులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. మొదట్లో ఒకరిద్దరుగా ఉన్నప్పుడు రెట్టింపు డబ్బులను తిరిగి పంపించిన యాప్ నిర్వాహకులు.. పెట్టుబడి పెట్టిన వారి సంఖ్య వందలకు చేరుకోవడంతో ముఖం చాటేశారు. ఐపీజీరెంట్.కామ్ పేరుతో ఉన్న వెబ్‌సైట్‌ను మూసేశారు. దీంతో బాధితులు ఇప్పుడు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు.

పలివెలకు ఎలా పాకిందంటే..

పలివెల గ్రామానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లోని తన స్నేహితుడు పంపిన లింక్ ద్వారా ఐపీజీ యాప్‌లో 20 రోజుల కిందట రిజిస్టర్ చేసుకున్నాడు. హైదరాబాద్‌లో చాలా మంది పెట్టుబడి పెట్టారని, మంచి లాభం వస్తోందని తన స్నేహితుడు చెప్పడంతో అతను పలివెలకు వచ్చి ఈ విషయాన్ని తన స్నేహితులకు తెలియజేశాడు. దీంతో 15 రోజుల కిందట 10 మంది చేరారు. కొందరు రూ.2వేలు, మరికొందరు రూ.5 వేలు, ఇంకొందరు రూ.10 వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. అలా పెట్టినవారికి వారం కిందటి వరకు చెప్పిన ప్రకారం వడ్డీతో పాటు అసలు జమ చేశారు. ఈ విషయం తెలిసి ఆ గ్రామంలో పలువురు ఒకరి తరువాత మరొకరు 150 మందికి పైగా రిజిస్టర్ చేసుకొని డబ్బులు పెట్టారు. గత శని, ఆదివారాల్లో రూ.30 వేలు పెట్టుబడి పెట్టిన వారికి అదనంగా రూ.30 వేలు కలిపి ఇస్తామని, వారం రోజులకు వడ్డీ రూ.27వేలు కలిపి మొత్తంగా రూ.87వేలు ఇస్తామని ఆశ చూపారు. దీంతో రూ.50 వేల నుంచి రూ.90 వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. అయితే, మోసగాళ్లు ఈ నెల 5వ తేదీ నుంచి ముఖం చాటేశారు. ఫోన్‌చేస్తే సమాధానం రావడం లేదు. యాప్‌ను, వెబ్‌సైట్‌ను మూసేశారు. దీంతో డబ్బులు పెట్టిన వారంతా ఆందోళన చెందుతున్నారు

రూ.80 వేలు పెట్టి మోసపోయా



ఐపీజీలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ వస్తుందని ఆశపడి పది రోజుల కిందట చేరా. మొదట రూ. 2 వేలు పెట్టాను. వాటికి వడ్డీ, అసలు జమచేశారు. తిరిగి రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున పెట్టా. అవీ వచ్చాయి. గత శనివారం రూ.30 వేలు, రూ. 50 వేలు పెడితే పెట్టిన నగదుకు డబుల్ వస్తాయని ఆశ చూపించారు. దీంతో రూ.80 వేలు పెట్టాను. ఆ తరువాత యాప్ ఓపెన్ కావడం లేదు.

– ఆనగంటి కృష్ణ, పలివెల

రూ. లక్షకు పైగా పోయాయి



మా గ్రామంలో చాలా మంది ఐపీజీలో చేరడంతో నేనూ వారం కిందట చేరాను. అందరిలాగే నేను మొదట్లో కొద్ది మొత్తం పెట్టాను. అవి రావడంతో రూ.1 లక్షకు పైగా పెట్టాను. ఆ తరువాత 3 రోజుల నుంచి యాప్ ఓపెన్ కావడం లేదు. ఐపీజీ ఏజెంట్ నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది.

– రూపని బాలరాజు







తిరుమల శ్రీవారిని శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ శ్రీదేవి, తెలంగాణ ఎన్నికల కమిషనర్ పార్థసారథి దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వీరికి వేద ఆశీర్వచనం అందించారు. –తిరుమల

శ్రీవారి దర్శనం కోసం 40 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూలు కిక్కిరిసిపోయాయి. వరుస సెలవులకు వారాంతపు రద్దీ తోడవడంతో మాతృశ్రీ తరి గొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్నప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో భక్తుల రద్దీనెలకొంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 50 వేల మంది యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ఎస్‌డీ టోకెన్లు, దివ్య దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కాగా, తిరుమల శ్రీవారిని శుక్రవారం 71,782 మంది దర్శించుకున్నారు. హుండీలో రూ.3.28 కోట్లు వేశారు. శ్రీవారి దర్శనానికి 40 గంటల సమయం పడుతోంది.

18న రామప్ప వారసత్వ దినోత్సవాలు

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్/హనుమకొండ: ఈ నెల 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా రామప్ప దేవాలయంలో జరిగే మెగా వేడుకల వాల్ పోస్టర్‌ను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక కళావైభవం వేడుకలను రామప్ప దేవాలయంలో పర్యాటకులను ఆకర్షించేవిధంగా నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకలకు ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ప్రముఖ డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి, సింగర్ కార్తీక్, ఫ్లూటిస్టు నవీన్‌తోపాటు 300 మంది కళాకారులు సంగీతవిభావరి నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కృషితో 800 ఏళ్ల చారిత్రక కాకతీయ కళాసంపద రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించిందన్నారు. తెలంగాణలో రామప్ప దేవాలయంతోపాటు యునెస్కో ప్రపంచ వారసత్వకట్టడాల గుర్తింపునకు అర్హత కలిగిన మరో 10 నుంచి 15 చారిత్రక, వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కృష్ణా మండలం ముడుమాలలోని 3 వేల ఏళ్లనాటి ఆదిమానవుల ఆనవాళ్లు, నిలువురాళ్ల సమాధులు, నల్లగొండ జిల్లా పానగల్లు గ్రామంలోని శ్రీ ఛాయసోమేశ్వర దేవాలయాన్ని ప్రపంచ వారసత్వసంపద గుర్తింపు కోసం ప్రతిపాదనలు సమర్పించామన్నారు. తెలంగాణలో ఉన్న సాంస్కృతిక, వారసత్వ ప్రదేశాలు, చిహ్నాల ప్రాముఖ్యత గురించిన అవగాహన, పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు.



వేడుకలో 'బలగం'చిత్ర ప్రదర్శన

'శిల్పం వర్ణం కృష్ణం'పేరిట రామప్ప దేవాలయంలో జరిగే వారసత్వ దినోత్సవాల పోస్టర్‌ను హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, గిరిజన, మహిళ సంక్షేమ శాఖమంత్రి సత్యవతి రాథోడ్ ఆవిష్కరించారు. వేడుకలకు 'బలగం'చిత్ర యూనిట్‌ను ఆహ్వానించి ఆ సినిమాను కూడా ప్రదర్శించనున్నట్లు ఎర్రబెల్లి తెలిపారు. రామప్ప సరస్సు సమీపంలో ఫుడ్ ఫెస్టివల్, సాయంత్రం పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి సత్యవతి తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ సభ్యులంతా కేసీఆర్ అనుచరులే..

- అందుకే ప్రభుత్వం వారిని కాపాడుతోంది
- కొత్త కమిషన్ ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



నేరెళ్లలో బాధిత దళితులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

సిరిసిల్ల: టీఎస్‌పీఎస్సీ సభ్యులంతా సీఎం కేసీఆర్ అనుచరులేనని, పేపర్ల లీకేజీ కేసులో ప్రభుత్వం వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలో అంబేడ్కర్, కాన్షీరాం విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభల్లో మాట్లాడుతూ, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యులు లింగారెడ్డి, సుమిత్ర, కారెం రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ.. అందరూ కేసీఆర్ అనుచరులేనన్నారు. వీరి కాల్‌డాటాను తీయాలని, అలాగే టాప్ 500 ర్యాంకర్ల వివరాలను బయటకు తీయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్, డీజీపీ, కమిషన్ చైర్మన్‌లు ఎందుకు విలేకరుల సమావేశం పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుత కమిషన్‌ను రద్దు చేయాలని, కొత్త కమిషన్ ఏర్పాటు చేసి పరీక్షలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఈనెల 18న అఖిల పక్షాల ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేస్తామని ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

సిరిసిల్లకు ఎన్ని పరిశ్రమలు వచ్చాయి?

ఐటీ మంత్రి కేటీఆర్ సిరిసిల్లకు ఎన్ని పరిశ్రమలు తెచ్చారని, ఎన్ని కంపెనీలు వచ్చాయని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవిత ఏమైనా స్వాతంత్య్ర సమరయోధురాలా? అని ఎద్దేవా చేశారు. ఆమె జైలుకు వెళుతుందన్న భయంతో ఇక్కడ 30 లక్షల మంది నిరుద్యోగ యువతను వదిలి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారని ధ్వజమెత్తారు. అదనపు అడ్వొకేట్ జనరల్ ప్రభుత్వ ఉద్యోగి అన్న విషయం మరచి, కవిత కోసం ఢిల్లీకి ఎలా వెళ్లారన్నారు. సీఎం కేసీఆర్‌కు పంజాబ్, జార్ఖండ్‌లో మాత్రమే రైతులు కనిపిస్తున్నారని, ఇక్కడ నేరెళ్ల దళితులు ఎందుకు కనిపించడం లేదని అన్నారు.

కల్తీ కల్లు కలకలం

- మహబూబ్‌నగర్‌లో ఘటన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరులో కల్తీ కల్లు కలకలం సృష్టించింది. మహబూబ్‌నగర్ పట్టణ శివారు కోయనగర్, మోతీనగర్, దొడ్డలోనిపల్లి ప్రాంతాలకి చెందిన కల్తీ కల్లు బాధితులు 10మంది పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడంతో వారి బంధువులు శుక్రవారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో తొమ్మిది మంది కోలుకోగా వారిని శనివారం ఇంటికి పంపించారు. మిగతా ఒకరికి చికిత్స అందిస్తున్నామని, ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నారని, ఎటువంటి ప్రాణాపాయం లేదని ఆస్పత్రి సూపరింటెంటిండెంట్ రాంకిషన్ తెలిపారు.

మోతాదు తగ్గించడంతోనేనా?: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా కల్లు విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. ఈత వనాలు ఉన్నా, లేకున్నా.. మత్తు కోసం కల్లులో నిషేధిత అల్ప్రాజోలం, క్లోరోహైడ్రేట్, డైజోఫాంలను కలపడం ఇక్కడ పరిపాటిగా మారింది. ప్రస్తుతం ఆల్ప్రాజోలంనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. తాజాగా అస్వస్థతకు గురైన బాధితులు మహబూబ్‌నగర్ పట్టణ శివారులో కల్తీ కల్లు దందాకు కేరాఫ్‌గా నిలిచిన కాంపౌండ్‌లలో తాగినట్లు తెలిసింది.

జిల్లా వార్తలు


పామాయిల్ గెలలు అప్పారావుపేటకే...

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీకి రైతులు ఈ నెల 10 నుంచి పామాయిల్ గెలలను తీసుకురావొద్దని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఏ.బాలకృష్ణ సూచించారు. ఫ్యాక్టరీలో వార్షిక నిర్వహణ చేపట్టనున్నందున పనులు ముగిసే వరకు గెలలను క్రషింగ్‌కు తీసుకురావొద్దని తెలిపారు. అప్పటివరకు రైతులు దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీకి గెలలు తీసుకురావాలని మేనేజర్ కల్యాణ్ వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

నేడు ఎంపీ నామ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆదివారం పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. అలాగే, కొత్తగూడెంలో కూడా పర్యటించనున్న ఎంపీ పలువురి కుటుంబాలను పరామర్శిస్తారు.

పూలే జయంతి కమిటీ వైస్ చైర్‌పర్సన్‌గా షకీనా



ఖమ్మంమామిళ్లగూడెం: రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ఈ నెల 11న అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రస్థాయిలో నిర్వహణ కమిటీని నియమించగా, వైస్ చైర్‌పర్సన్‌గా ఖమ్మానికి చెందిన షేక్ షకీనా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవాలోపంపై జరిమానా

ఖమ్మంలీగల్: వినియోగదారుడికి తలెత్తిన సేవాలోపంపై సత్తుపల్లిలోని కపిల్ చిట్స్(కోస్తా)కు రూ.15 వేలు జరిమానా విధిస్తూ వినియోగదారుల కమిషన్ సభ్యురాలు ఎ.మాధవీలత శనివారం తీర్పు చెప్పారు. న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. తల్లాడకు చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి నారపోగు శ్రీనివాసరావు సత్తుపల్లిలోని కపిల్ చిట్స్(కోస్తా)లో రూ.5 లక్షల చీటీ వేశాడు. గడువు ముగిసినా డబ్బు ఇవ్వకపోవడంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. అయితే, గతంలో శ్రీనివాసరావు ష్యూరిటీ సంతకం పెట్టడంతో డబ్బులు అటు మళ్లించినట్లు నిర్వాహకులు చెప్పగా, సమాచారం ఇవ్వకపోవడాన్ని నేరంగా పరిగణిస్తూ సేవాలోపం కింద రూ.10 వేలు, లిటిగేషన్ ఖర్చుల కింద రూ.5 వేలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

యాతాలకుంట టన్నెల్ పనులు షురూ..



యాతాలకుంట సమీపాన టన్నెల్ నిర్మాణానికి ముగ్గు పోస్తున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు

- భూనిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ
- పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లా రైతులకు సాగునీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టులో భాగంగా యాతాలకుంట వద్ద టన్నెల్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతానికి చెందిన భూనిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ కావడంతో కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టారు. మూడేళ్లుగా ఈ పనులు పెండింగ్‌లో ఉండడంతో ఇటీవల మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి చర్చించారు. టన్నెల్ పూర్తయితేనే బేతుపల్లి చెరువులోకి నీరు వస్తుందని వివరించడంతోపాటు అక్కడ చేపట్టాల్సిన పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం అధికారులను ఆదేశించడమేకాక మంత్రి హరీశ్‌రావు పనులపై సమీక్షించారు. ఈ నేపథ్యాన భూనిర్వాసితులకు సుమారు రూ.5 కోట్ల పరిహారం అందింది. ఈక్రమంలో కాంట్రాక్టర్ యాతాలకుంట సమీపాన టన్నెల్ నిర్మాణానికి ఉపక్రమించగా, నిర్మాణ సామగ్రి చేరవేసి పనులు మొదలుపెట్టారు.

టన్నెలే ప్రధానం

కమలాపురం పంప్‌హౌస్ నుంచి వచ్చే సీతారామ ప్రాజెక్టు నీరు బేతుపల్లి చెరువులోకి రావాలంటే యాతాలకుంట వద్ద నిర్మించే టన్నెల్ కీలకం. కిలోమీటర్ మేర ఉండే ఈ టన్నెల్ నిర్మాణం పూర్తయితే నీరు అక్కడ నుంచి రుద్రాక్షపల్లి, బుగ్గపాడు, నాగుపల్లి మీదుగా బేతుపల్లి చెరువులోకి చేరుతుంది. దీంతోపాటు అనేక చెరువులు, లంకాసాగర్ ప్రాజెక్టులోకి కూడా నీరు పుష్కలంగా చేరనుంది. ఈ టన్నెల్ పనులు ప్రారంభం కావడంతో త్వరలోనే సత్తుపల్లి ప్రాంతానికి సీతారామ నీరు వచ్చి చేరేందుకు వీలు ఏర్పడనుందని భావిస్తున్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు..

పెండింగ్‌లో ఉన్న టన్నెల్‌తోపాటు చిన్నచిన్న పనులు పూర్తి చేస్తే సత్తుపల్లి ప్రాంతానికి సీతారామ నీరు అందుతుంది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా మంత్రి హరీశ్‌రావును సమీక్షించాలని సూచించి అధికారులతో చర్చించారు. ఆవెంటనే నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ కావడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకొచ్చారు. నా వినతిపై వెంటనే స్పందించి పనులు చేపట్టేలా చర్యలకు ఆదేశించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

– తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి

మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాల్సిందే..

- పాలేరులో బీఆర్ఎస్ పొత్తుతో సీపీఎం పోటీ
- కమ్యూనిస్టులు లేకుండా బీఆర్ఎస్ గెలవడం అసాధ్యం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



ఖమ్మంరూరల్: తమ్మినేని వీరభద్రానికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/కూసుమంచి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో శనివారం పర్యటించిన ఆయన పలువురు కార్యకర్తలను పరామర్శించారు. అలాగే, పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించగా వివిధ కాలనీల ప్రజలు తమ సమస్యలపై తమ్మినేనికి వినతిపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వీరభద్రం మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదం పెరిగిపోగా, బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. దీనికి తోడు ప్రభుత్వాలను కూల్చే కుట్ర చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటనకు ఎలా వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్‌తో కలిసి రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. కాగా, పాలేరులో సీపీఎం అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని, బీఆర్ఎస్‌తో పొత్తుతో పాలేరులో సీపీఎం పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడతామని తెలిపారు. కాగా, గత ఎన్నికల్లో సీపీఐ ఓట్లతో గెలిచిన విషయాన్ని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మరిచిపోయారా? అని తమ్మినేని ప్రశ్నించారు. ఎన్నికల నాటికి పొత్తుపై స్పష్టత వస్తుందని, కమ్యూనిస్టులు లేకుండా జిల్లాలో బీఆర్ఎస్ గెలవడం అసాధ్యమని ఆయన చెప్పారు. కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు రమేశ్, బషీరుద్దీన్, నండ్ర ప్రసాద్, వి.సుదర్శన్‌రెడ్డి, వై.ప్రసాద్‌రావు, పి.మోహన్‌రావు, అంబటి వెంకటేశ్వర్లు, దండ్యాల రవి, సైదులు, ఎడవెల్లి రమణారెడ్డి, గురుమూర్తి, హన్మంతరావు, గంగాధర్, రాజు, కర్ణబాబు, గన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి సమ్మేళనానికి జూపల్లి..

- నేడు కొత్తగూడెం రానున్న మాజీ మంత్రి కృష్ణారావు
- అనుచరులతో కలిసి వచ్చేందుకు వందకు పైగా వాహనాలు సిద్ధం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యాన కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నారు. ఈ సమ్మేళనం వేదికగా జూపల్లి తన గళం వినిపించే అవకాశమున్నట్లు సమాచారం. ఇందుకోసం సుమారు వంద వాహనాల్లో కొల్లాపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు బయలుదేరేందుకు సిద్ధమవుతున్నారు. సీనియర్ రాజకీయ నేత, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన జూపల్లి గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న బీరం హర్షవర్ధన్ రెడ్డి తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీలోనే అంతర్గత పోరు కొనసాగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జూపల్లి ఏ పార్టీలో చేరనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొనగా.. కొంతకాలంగా బీఆర్ఎస్, సీఎం కేసీఆర్‌పై విమర్శలు గుప్పిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమ్మేళనానికి ఆయన హాజరుకానుండటం ఆసక్తి రేపుతోంది.

ఆచితూచి అడుగులు..

గత ఎన్నికల్లో జూపల్లి ఓటమి పాలయ్యాక ఆయన ప్రత్యర్థి బీరం హర్షవర్ధన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఇరువురు ఒకే పార్టీలో ఉన్నా అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. తన అనుచరులను ఎమ్మెల్యే వేధిస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్న జూపల్లి.. కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో కేఎల్ఐ కాల్వ సమస్యలపై రైతులతో కలసి నిరసన తెలుపుతున్నా, పార్టీ మార్పుపై మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఇదేసమయాన ఖమ్మం మాజీ ఎంపీ కూడా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ఏడాది జనవరి నుంచి బీఆర్ఎస్‌తో పాటు సీఎం కేసీఆర్‌పై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఆయన పార్టీ మారడం తథ్యమేనని తెలుస్తున్నా.. ఏ పార్టీలో చేరతారనే నిర్ణయాన్ని ఇప్పటివరకు వెల్లడించలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాల్లో భాగంగా కొత్తగూడెంలో ఆదివారం సమావేశం ఏర్పాటుచేయగా.. మాజీ మంత్రి జూపల్లి అనుచరులతో ఈ సభకు హాజరవుతుండడం గమనార్హం.

కేసీఆర్‌వన్నీ మాయమాటలే

- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మధిర, ఎర్రుపాలెం, బోనకల్‌లో క్యాంపు కార్యాలయాల ప్రారంభం



మధిర: మాట్లాడుతున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి

మధిర: తెలంగాణ ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ మాయమాటలతో మోసం చేస్తూ కాలం గడుపుతున్నారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. మధిర, ఎర్రుపాలెం, బోనకల్‌లో ఏర్పాటుచేసిన క్యాంపు కార్యాలయాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో పొంగులేటి మాట్లాడుతూ మిగులు నిధులతో ఏర్పడిన తెలంగాణను కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. అలవికాని హామీలతో రెండు సార్లు అధికారం చేపట్టగా, ఇంకోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా లేరని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నందున సిట్‌తో కాకుండా సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఇటీవల సీఎం జిల్లా పర్యటనకు వచ్చిన సమయాన పంట నష్టపోయిన రైతులకు ప్రకటించిన పరిహారం నేటికీ అందలేదన్నారు. అలాగే, రైతుల రుణమాఫీ చేయకపోగా, సబ్సిడీ యంత్రాలు ఇవ్వటం లేదని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేక పోతున్నారని చెప్పారు. కాగా, అధికారాన్ని అడ్డు పెట్టుకుని కొందరు బీఆర్ఎస్ నాయకులు తన అభిమానులను బెదిరిస్తే సహించేది లేదని పొంగులేటి హెచ్చరించారు. అన్ని నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు పూర్తికాగానే ఈనెలాఖరుకల్లా ప్రజాభీష్టం, కార్యకర్తల అభిప్రాయాల మేరకు ఏపార్టీలో చేరేది వెల్లడిస్తానని తెలిపారు. అప్పటి వరకు ప్రజలకు అందుబాటులో ఉండేందుకే మండల కేంద్రాల్లో క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు పొంగులేటి వివరించారు.

జెడ్పీ చైర్మన్ వివక్ష

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడుస్తున్నందున తనపై జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ వివక్ష చూపుతున్నారని ఎర్రుపాలెం జెడ్పీటీసీ సభ్యురాలు శీలం కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా ఒక్కో జెడ్పీటీసీకి రూ.60 లక్షల నిధులు కేటాయించి తనకు మాత్రం రూ.20 లక్షల కేటాయించారని తెలిపారు. అలాగే, జమలాపురం పుణ్యక్షేత్రానికి వెళ్లే బీటీ రోడ్డుకు నిధులు మంజూరైనా ఉద్దేశపూర్వకంగా ప్రొసీడింగ్స్ నిలిపివేశారని ఆరోపించారు. కాగా, క్యాంపు కార్యాలయాల ప్రారంభానికి హాజరైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమానులు ఘన స్వాగతం పలకడంతో పాటు బైక్ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో డాక్టర్ కోట రాంబాబు, డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, మధిర కౌన్సిలర్ యర్రగుంట లక్ష్మి, నాయకులు, ప్రజాప్రతినిధులు దేవిశెట్టి రంగారావు, మందడపు తిరుమల్ రావు, చిలకా వెంకటేశ్వరరావు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, రవికాంత్, యర్రగుంట రమేశ్, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, అంకసాల శ్రీనివాసరావు, బండి వెంకటేశ్వర్లు, గూడూరు రమణారెడ్డి, కొత్తపల్లి విద్యాసాగర్, శీలం అక్కిరెడ్డి, శీలం జయలక్ష్మి, కూరపాటి యశోద, అప్పమ్మ, శీలం వెంకట్రాంరెడ్డి, లక్కిరెడ్డి నర్సిరెడ్డి, బుర్రా నారాయణ, గూడూరు రమణారెడ్డి, వేమిరెడ్డి త్రివేణి, సామనూరి కృష్ణార్జున్‌రాజు, గూడూరు నర్సింహారెడ్డి, శీలం ఉమామహేశ్వరి, శీలం అక్కమ్మ, సైదానాయక్, చిలకా వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, ఉమ్మినేని కృష్ణ, బాగం నాగేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.